

ఇంతా జరుగుతున్నా.. ఏం చేస్తున్నారు..

- శాఖల మధ్య సమన్వయ లోపం
- లింగ నిర్ధారణ పరీక్షలపై కలెక్టర్ సీరియస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు సమాచారం మీకు ఎందుకు తెలియడం లేదని, శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా తెలుస్తోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో పిసిపిఎన్ డిటి యాక్ట్ 1994 డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, ఛైర్మన్ అధ్యక్షతన నిర్వహించగా మొదటి అదనపు జిల్లా జడ్జ్ ఎస్.రమేష్, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండడంతో పిసిపిఎన్ డిటి యాక్ట్ నియమ నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కేంద్రంలో చాలా కాలంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎందుకు తెలుసుకోలేకపోయారని, క్షేత్ర స్థాయిలో గల ఆశా, ఏఎన్ఎంలు స్థానికంగా ఉన్నప్పటికీ మొదటి, రెండు సంతానాలలో ఆడపిల్లలు ఉండి మూడవ సారి ఆ మహిళ గర్భం దాల్చిన విషయాన్ని ఎందుకు తెలుసుకోలేక పోతున్నారని, ఆ సమాచారం ఎందుకు రావడం లేదన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు కలసి సిడిపిఓలు, మెడికల్ ఆఫీసర్లతో కలసి గత 10 సంవత్సరాలలో ఎప్పుడైనా సమన్వయ సమావేశాలు నిర్వహించారా, అంగన్వాడీ కార్యకర్తలు గర్భిణీలకు అందించే పోషకాహారం వారు స్వయంగా వచ్చి తీసుకుని వెళ్లకపోవడం ద్వారా కూడా వారి ఆరోగ్య పరిస్థితి తెలుస్తుందని, ఈ విషయంలో రెండు శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా తెలుస్తున్నదన్నారు. ఈ విషయంలో జిల్లా స్థాయి అధికారులు ఇద్దరు వ్యక్తిగతంగా ఆశా, ఏఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడడం ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులు కొంత వరకు అర్థం అవుతాయని ఈ దిశగా పనిచేయాలన్నారు. అక్రమ అబార్షన్ల ద్వారా ఆడపిల్లలు చనిపోతే, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆడ పిల్లల నిష్పత్తి మరింత తగ్గుతుందన్నారు.

చిత్తూరు జిల్లాకు సంబంధించి 2024 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మంది పురుషులకు 947 మంది స్త్రీలు ఉన్నారని, ఈ నిష్పత్తి ఇతర జిల్లాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో పని చేసే అధికారులు, సిబ్బంది భాధ్యతాయుతంగా పని చేయడం ద్వారా మాత్రమే లింగ నిర్ధారణ పరీక్షల నిర్వహణ ను అరికట్టవచ్చునన్నారు. జిల్లాలో ప్రధానంగా ఇతర రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న నగరి, పలమనేరు, పుంగనూరు, వి.కోట మండలాలలో ప్రైవేట్ ఆసుపత్రులలో అనుమతి లేకుండా జరుగుతున్న అబార్షన్ల శాతం మిగిలిన మండలాలతో పోలిస్తే ఎక్కువగా ఉన్నదన్నారు. డివిజన్ల వారీగా ఆర్ఎంపి డాక్టర్లతో సమావేశాలు నిర్వహించాలని డిఎం అండ్ హెచ్ఓను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలని ఆదేశించారు. మెడికల్ షాపులో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే మందులు ఇవ్వరాదనే విషయాన్ని అందరికీ స్పష్టంగా తెలియజేయాలని డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. స్కానింగ్ మెషిన్లను అనధికారికంగా అమ్ముతున్న వారిపై నిఘా ఉంచాలని మహిళా పోలీస్ సిఐ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ అంశానికి సంబంధించిన రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. సమావేశంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి, ఐసిడిఎస్ పిడీ వెంకటేశ్వరి, డిఐఓ హనుమంత రావు,జిల్లా ప్రధాన వైద్యశాఖ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషశ్రీ, డ్రగ్స్ ఇన్స్పెక్టర్ కీర్తన, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ మహేశ్వర్, ఎస్ఐ నాగసౌజన్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య, ఆరోగ్య శాఖలతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా ఉంచాలి

లింగ నిర్ధారణ పరీక్షలపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

చిత్తూరు జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు నేరమైనప్పటికీ సంపాదన ధ్యేయంగా నడుస్తున్న స్కానింగ్ సెంటర్లు ఇష్టారాజ్యంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని వీటి పై పలు రకాల అనుమానాలు ఉన్నాయని, ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా లేకపోవడమే ప్రధాన కారణం అని వాటిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంగా జిల్లా కలెక్టర్ లింగ నిర్ధారణ చేస్తున్న సెంటర్లపై తనిఖీ చేశారంటే ఏ స్థాయిలో వారి వ్యాపారం కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. ప్రధానంగా చిత్తూరు జిల్లా కేంద్రంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా ప్రజల దగ్గర నుంచి డబ్బులు దండుకుంటూ వ్యాపారం చేస్తున్నారని వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అపోలో ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ ఆసుపత్రిలో అరకొర సౌకర్యాలు ఉండడంతో ప్రైవేట్ ఆస్పత్రుల పంట పండుతున్నదని తెలిపారు. చిన్నచిన్న జబ్బులు కూడా రకరకాల పరీక్షలు పేరుతో వేలకువేలు డబ్బులు దండుకోవడం సారామాములే అని, కోట్లు గడుస్తున్న ఆసుపత్రి యాజమాన్యాలు ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందికి మాత్రం కనీస వేతనాలు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. సంబంధిత వైద్య జిల్లా అధికారులు నిరంతరం బిజీబిజీగా ఉంటున్నప్పటికీ ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా ఉండకపోవడం, వాళ్ళు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బహిరంగ చర్చ జరుగుతున్నదని విమర్శించారు. ఇప్పటికైనా కలెక్టర్ చర్యలు తీసుకోవడాన్ని సిపిఎం అభినందిస్తున్నదన్నారు. జిల్లా వైద్యాధికారులు పర్యవేక్షణ చేసి స్కానింగ్ సెంటర్లలపై, డ్రగ్ ఇన్స్పెక్టర్ మెడికల్ షాపులపై తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలకు అండగా పోరాటం చేస్తామని హెచ్చరించారు

లక్ష్యానికి దూరంగా..స్వచ్ఛ సంకల్పం

- కార్యాలయాల ముందు ప్రతిజ్ఞ
- వెనుక అధ్వానంగా పారిశుధ్యం

ప్రజాశక్తి- యాదమరి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర... స్వచ్ఛ ఆంధ్ర... కార్యక్రమం అభాసు పాలవుతోంది. మండలస్థాయి అధికారుల నిర్వహణ పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో స్వచ్ఛ సంకల్పం... లక్ష్యానికి దూరంగా ఉంది. యాదమరి మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణంలో వివిధ శాఖలకు చెందిన ఐదు కార్యాలయాలున్నాయి. ఈ కార్యాలయం ఆవరణంలో ఉన్న ఐదు శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది, ప్రతినెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ సంకల్పం ప్రతిజ్ఞ చేస్తున్నారే తప్ప .. పారిశుధ్య చర్యలు చేపట్టడంలో ఆచరణలో అమలు కావడం లేదు.

స్థానిక ఉపాధి హామీ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం వెనుక వైపు పిచ్చి మొక్కలు, ఉపాధి హామీ కార్యాలయం చుట్టూ కంప చెట్లు అధికంగా ఉన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో తొలగించలేదు. కార్యాలయం చుట్టూ పారిశుధ్యం అధ్వానంగా ఉంది. యాదమరి గ్రామ సచివాలయం, ఉపాధి హామీ, హౌసింగ్ శాఖ కార్యాలయాలు ఇక్కడే ఉండడంతో ఈ కార్యాలయాలకు ప్రతిరోజు చుట్టుపక్క గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఉపాధి హామీ, గ్రామ సచివాలయం కార్యాలయంలో గోడలు బీటలు భారీ ఉండడంతో ఆ బొరియల్లో పాములకు ఆవాసాలుగా తయారయ్యాయి. కొన్నిసార్లు పాములు ఉపాధి హామీ కార్యాలయంలో వచ్చి ఉపాధి సిబ్బంది భయభ్రాంతులకు గురైన సందర్భాలు ఉన్నాయి. కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది ప్రతిరోజు కార్యాలయంలో అడుగు పెట్టేటప్పుడు ఏ టేబుల్ కింద ఎక్కడ పాములు ఉన్నాయని బిక్కుబిక్కుమంటూ కార్యాలయం తలుపులు తీస్తున్నారు. భవనానికి మరమ్మతులు చేపట్టాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు.



ఉపాధి హామీ కార్యాలయంలో పాములుకు ఆవాసాలుగా మారిన బొరియలు

చెప్పడానికే పారిశుధ్యం.. ఆచరణ ఏది..?

ఎక్కడి నీరు అక్కడే నిల్వ ఉండాలని ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకొని భూగర్భ జలాలు పెంచే విధంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఉపాధి హామీ పథకం కింద భూగర్భ జలాలు పెంచేందుకు నీటినిల్వ కుంటలు మండలంలో అధికంగా చేపట్టేందుకు ఉపాధి అధికారులు చర్యలు తీసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆరు కార్యాలయాలున్నాయి. కార్యాలయాలు పరిధిలో వర్షపునీరును వృధా కానీయకుండా ఉండేవిధంగా అధికారులు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. అలాగే ఉపాధి హామీ కార్యాలయంలో ఉన్న ఖాళీ స్థలంలో ఫారంఫండ్ తవ్వి నీటినిల్వకు చర్యలు చేపట్టాలని గతంలో ఉపాధి కార్యాలయానికి వచ్చిన చిత్తూరు జిల్లా పథక సంచాలకులు మండల ఉపాధి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినా దానిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. అంతేకాకుండా నీటి నిల్వకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం మోడల్స్ పంట సంజీవిని, నీటి నిల్వకుంట ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల ఆదేశాలు ఇచ్చారు. కార్యాలయం పరిధిలో మోడల్ పంట సంజీవిని ఏర్పాటు చేస్తే దీన్ని చూసిన రైతులకు అవగాహన వచ్చి రైతుల పొలంలో అధికంగా నీటి కుంటలు ఏర్పాటు చేయడానికి వెసులుబాటు ఉంటుంది. ఇప్పటికైనా ఉపాధి హామీ అధికారులు ఆ దిశగా పనులు ప్రారంభిస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.



మండల పరిషత్ కార్యాలయం వెనుక గోడలకు అల్లుకొని ఉన్న పిచ్చి మొక్కలు

25న సీఎం కుప్పం పర్యటన

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : ఈనెల 25వ తేదీన తన సొంత ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడానికి కుప్పానికి విచ్చేయనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా శనివారం ముఖ్యమంత్రి నివాసం, హెలిప్యాడ్లు, రోడ్డు మార్గం, పరిసర ప్రాంతాలను జిల్లా ఎస్పీ మణికంత చందోలు పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ప్రజాసమూహం ఎక్కువగా కేంద్రీకృతం అయ్యే ప్రాంతాలు, రూట్ మ్యాప్, ట్రాఫిక్ మేనేజ్మెంట్, పార్కింగ్ ఏర్పాట్లు, ఫైర్సేఫ్టీ, ఎంబులెన్స్లు తదితర సౌకర్యాలను ఎస్పీ సమీక్షించారు. పర్యటనకు భద్రత కల్పించాల్సిన అధికారులు, పోలీసు బలగాలకు అవసరమైన దిశానిర్దేశం అందజేశారు. స్థానిక పోలీస్ అధికారులు, ఇంటెలిజెన్స్ విభాగం, స్పెషల్ బ్రాంచ్ బలగాలతో కలిసి సమన్వయంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.

కియా కారెన్స్ క్లావిస్ కారు ఆవిష్కరణ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ఇరువారం రహదారిలోని హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కార్ షోరూంలో శనివారం కియా కారెన్స్ క్లావిస్ కారు ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి, డైరెక్టర్లు చెరకు నిరంజన్, సి.భారతి, సి.హోషిమారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎండి మాట్లాడుతూ ఇప్పుడు కియా నుండి విడుదలైన ఈ కొత్త కారన్స్ క్లవిస్ కారు అత్యాధునిక సదుపాయాలతో అందిస్తున్నామన్నారు. బోస్ ప్రీమియం సౌండ్ సిస్టం విత్ 8 స్పీకర్స్, బెస్ట్ ఇన్ సెగ్మెంట్ 26.62 డ్యూయల్ పారనోమిక్ డిస్ప్లే పానల్, డ్యూయల్ పాన్ పొరనోమిక్ సన్ రూఫ్, వంటి సౌకర్యాలతో ఎనిమిది రంగులలో అందుబాటులో ఉన్నాయన్నారు. వినియోగదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుకింగ్కు 9281405123 ఫోన్ నెంబర్ను సంప్రదించాలని సూచించారు. సంస్థ ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

చెట్ల సంరక్షణ బాధ్యత తీసుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం జిల్లా సచివాలయంలో జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్ఓ కె. మోహన్ కుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా పంచాయతీ, మున్సిపల్ పరిధిలో కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. వాతావరణ కాలుష్య నియంత్రణకు పచ్చదనం ఎంతగానో ఉపయోగ పడుతుందని, మొక్కల పెంపకం పర్యావరణాన్ని కాపాడడంతో పాటు శారీరక మానసిక ఆరోగ్యం కాపాడుకోవడంలో ముఖ్యమన్నారు. వాతావరణం మార్పులను తగ్గించడంలో మొక్కలు ఉపయోగపడతాయని, సూర్యుడి నుండి వచ్చే రేడియేషన్ తగ్గించేందుకు ఉపయోగపడతాయని, తద్వారా చర్మ కేన్సర్ వంటి వ్యాధుల నుండి రక్షణ కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనం పెంపులో భాగంగా మొక్కలను నాటడం, వాటి సంరక్షణ వ్యక్తిగత భాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్తో కలిసి కలెక్టరేట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలించి కలెక్టరేట్ను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పచ్చదనం పెంపునకు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్ ఆవరణంలో పచ్చదనం పెంపునకు తీసుకుంటున్న చర్యలపై డిఆర్ఓ వివరించారు. కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ వాసుదేవన్, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



చిత్తూరులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మేయర్

జాగ్రత్తలతో వేసవి వేడి నుంచి ఉపశమనం: మేయర్

వేసవి వేడి నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మేయర్ ఎస్.అముద పిలుపునిచ్చారు. మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మెసానిక్ మైదానం వద్ద రైల్వే గేట్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవనం ఆవరణంలో 'బీట్ ది హిట్' కార్యక్రమాలను నిర్వహించారు. రైల్వే గేట్ పడినప్పుడు వాహనదారులు ఎండ వేడిమికి ఇబ్బంది పడకుండా గ్రీన్ మ్యాట్తో పై కప్పు వేయించారు. వేచి ఉండే వాహనదారులకు మేయర్, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్ తాగునీరు, ఓఆర్ఎస్ నీరు అందించారు. అనంతరం బీఆర్ అంబేద్కర్ భవనం ఆవరణంలో మొక్కలు నాటి నీరు పోశారు. వేసవి నేపథ్యంలో పక్షులకు నీరు అందించడం కోసం చెట్లలోని కొమ్ములకు మట్టి పాత్రలను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రజాప్రతినిధులు, అధికారులు నీరు పోశారు. అనంతరం భవన నిర్మాణ కూలీలకు వేసవి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నీరు పుష్కలంగా తాగాలని, నీడలో పనులు చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు, కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా మేయర్ ఎస్.అముద మాట్లాడుతూ వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు, కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నగరంలో 15 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి నీటిని అందుబాటులో ఉంచామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలోని అన్ని ప్రాంతాల్లో బీట్ ద హీట్ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. నగరంలో 500 మొక్కలు నాటామని, జనం ఎక్కువగా గుమికూడే ప్రాంతాల్లో నీడ ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో సీఎంఎం వెంకటరమణ, కార్పొరేటర్ అశోక్, అట్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే 32వ డివిజన్ జనసేన పార్టీ కార్పొరేటర్ పూర్ణచంద్రరావు, తెలుగుదేశం చిత్తూరు పార్లమెంట్ కార్యదర్శి బెల్లం సతీష్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి, 32 వ డివిజన్ టిడిపి నాయకురాలు హేమావతి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంను నిర్వహించారు.

వేసవిలో తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ఈ నెల 22వ తేదీ నుండి జూలై 13వ తేదీ వరకు మూడు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్లను హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నట్లు ఐఆర్సిటిసి టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డిఎస్జిపి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా యాత్రకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్యాకేజీ 1: (దివ్య దక్షిణ యాత్రతో జ్యోతిర్లింగం– ఎస్సిజెడ్బిసి 42) ఈ యాత్రలో అరుణాచలం / రామేశ్వరం / మధురై / కన్యాకుమారి / త్రివేండ్రం / తిరుచ్చి / తంజావూరు ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర మే 22వ తేదీన ప్రారంభమై 30వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.14,700లు, 3 ఏసీ ధర రూ.22,900, 2 ఏసీ ధర రూ.29,900లు ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా వెళ్తుంది. ప్యాకేజీ 2: (గంగా రామాయణ పుణ్య క్షేత్ర యాత్ర– ఎస్సిజెడ్బి 44): ఈ యాత్రలో (కాశీ) వారణాసి / అయోధ్య / నైమిశారణ్య / ప్రయాగరాజ్ / శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర జూన్ 14 వ తేదీన ప్రారంభమై 22 వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.16200, 3 ఏసీ ధర రూ.26500, 2 ఏసీ ధర రూ.35000లు ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్ మీదుగా వెళ్తుంది. ప్యాకేజీ 3: (ఐదు జ్యోతిర్లింగ యాత్ర– ఎస్సిజెడ్బిజి 43 ఉజ్జయిని (మహాకాళేశ్వర్ – ఓంకారేశ్వర్) త్రయంబకేశ్వర్ – భీమశంకర్ – ఘృష్ణేశ్వర్). ఈ యాత్రలో మహాకాళేశ్వర్ / ఓంకారేశ్వర్ / త్రయంబకేశ్వర్ / భీంశంకర్ / ఘృష్ణేశ్వర్ / ఎల్లోరా / మోవ్/ నాగ్పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. ఈ యాత్ర జూలై 5వ తేదీన ప్రారంభమై 13 వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.14700లు, 3 ఏసీ ధర రూ.22,900లు, 2 ఏసీ ధర రూ.29,900లు ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ కామారెడ్డి నిజామాబాద్ ధర్మాబాద్ నాందేడ్ ముధడ్, పూర్ణ మీదుగా వెళ్తుంది. ప్యాకేజీలో సౌకర్యాలు: రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం), వాటర్ బాటిల్, టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా అలాగే రైల్వేస్టేషన్ నుండి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగా ఉచితం. ప్రతి రైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారు. ప్రతి 70 మందికి ఇద్దరు కోర్డినెటర్లు అందుబాటులో ఉండి అన్ని సావకార్యాలు సమకురుస్తారు. కోచ్ కి ఒక సెక్యూరిటీ గార్డ్ అలాగే రైలులో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలియజేశారు. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు 97013 60701, 92810 30712, 92810 30749, 92810 30750, 92810 30740ను, వెబ్సైట్ని సంప్రదించాలన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా ఏది..?

- తగ్గుతున్న ఆడబిడ్డలను నిష్పత్తి
- చిత్తూరు కేంద్రంగా లింగ నిర్ధారణ పరీక్షలు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పిసిపిఎన్ డిటి 1994 చట్టాన్ని ఆడబిడ్డ రక్షణ కోసం ప్రభుత్వం భ్రూణ హత్యలను నిరోధించేలా తీసుకొచ్చింది. భ్రూణ హత్యలు నిరోధించి ఆడబిడ్డలను సంరక్షించాలనేదే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. ఈచట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేలా జిల్లాలో కలెక్టర్ చైర్మన్ వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్, పోలీసు శాఖల ఉన్నతాధికారులు కమిటీ సభ్యులుగా ఉంటారు. ప్రతి మూడు నెలలకు ఓసారి జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించి జిల్లాలో పిసిపిఎన్ డిటి చట్ట అమలు తీరుపై సమీక్షించాల్సి ఉంటుంది.

చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు కావడంతో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని తెలుసుకునేందుకు చిత్తూరు జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. మగ బిడ్డ కోసం తాపత్రయ పడుతున్న తల్లిదండ్రుల ఆశలను క్యాష్ చేసుకొనేలా చిత్తూరు కేంద్రంగా స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి.. పరిస్థితి ఎంత దారుణంగా తయారైంది అంటే... జిల్లా కలెక్టర్, ఎస్పీ నివాసానికి సమీపంలోని తొమ్మిదవ డివిజన్ భరత్ నగర్ కాలనీలో స్థానిక చిత్తూరుకు చెందిన ఓ మహిళ స్కానింగ్ సెంటర్ను నిర్వహిస్తూ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి వచ్చే మహిళలకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తోంది. జిల్లా కలెక్టరే స్వయంగా డెకాయిట్ ఆపరేషన్లో పాల్గొని లింగ నిర్ధారణ ముఠాను రెడ్ హ్యాండెడ్గా పట్టుకుంటే తప్ప ఈ విషయం వెలుగులోకి రాలేదు.

జిల్లా కేంద్రంలోని మెడికల్ షాపులు, ఫార్మసీలలో కూడా భ్రూణ హత్య కోసం ఉపయోగించే మందులు దొరికాయ్ అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చిత్తూరు జిల్లాలో 2024 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మంది పురుషులకు 947 మంది స్త్రీలు ఉన్నారు. ఈ నిష్పత్తి ఇతర జిల్లాలతో పోలిస్తే చాలా తక్కువ జిల్లాలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్లో స్కానింగ్ సెంటర్ల విషయంలో వైద్య ఆరోగ్యశాఖ చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ ఉండడంతోనే లింగ నిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా సాగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. అనధికారికంగా నడుస్తున్న స్కానింగ్ సెంటర్ల నుండి వైద్యఆరోగ్య శాఖకు ముడుపులందుతున్నట్లు సమాచారం. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఆడ మగాన్ని తేల్చేందుకు 30 నుండి 40 వేల వరకు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తీసుకుంటున్నట్లు బుధవారం జిల్లా కేంద్రంలో పట్టుబడ్డ తమిళనాడు లింగ నిర్ధారణ ముఠా విచారణలో తెలిసింది. గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వ్యక్తులు కోట్లల్లో గడిస్తున్నట్లు తెలుస్తోంది. ఆడబిడ్డలను పురిటిలోనే చిది వేయకుండా లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టం పటిష్టంగా అమలు చేసి పురిటిలోనే చిదిమేయపడుతున్న ఆడబిడ్డలను సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అకాల వర్షంతో భారీగా నష్టం



నేలవాలిన వరి



గాలికి రాలిన మామిడి

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కారణంగా రైతులకు పంట నష్టం తప్పడం లేదు. ఓ వైపు వర్షం వలన చెరువులు నిండుతున్నాయని ఆనందించినా.. మరోవైపు సాగులో ఉన్న మామిడి గాలికి కాయలు నేలరాలుతున్నాయి, అరటి చెట్లు పడిపోతున్నాయి, కోత దశలో ఉన్న టమాటా, బీన్స్, వరి, రాగులు వంటి పంటలు నేలమట్టం అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. మండలంలోని మొసలి మడుగు గ్రామానికి చెందిన యుగంధర్ నాయుడు అనే రైతుకు చెందిన కోత దశలో ఉన్న ఒకటిన్నర ఎకరా వరి పంట వర్షాల కారణంగా నేలవాలి నీటమునిగింది. అదేవిధంగా మెట్ట ప్రాంతాల్లో మామిడి తోటల్లో అకాల వర్షాలకు కోత దశలో ఉన్న మామిడి కాయలు నేల రాలిపోతున్నాయి. అకాల వర్షాలకు నష్టపోతున్న ఉద్యాన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

వెదురుకుప్పం: మండలంలో శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వాన పడింది. పగలంతా వేడి, సాయంత్రం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాల వలన జనజీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. మండలంలోని మామిడి రైతులను ఈదురు గాలుల వలన కాయలు నేలరాలి నష్టపోతునానరు. మరికొందరు రైతులు పంట కోత దశలో ఉండగా వర్షాల వలన నష్టం తప్పడం లేదని వాపోతున్నారు.

నిండిన కుంటలు, చెరువులు

గంగవరం: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని చిన్నచిన్న కుంటలు, చెరువులకు మొరవ పారడంతో పెద్దగా ఉన్న చెరువులు సగభాగానికి నీరు చేరుకోవడంతో రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం చెరువుల్లో ఒక చుక్క నీరు కూడా లేదని వర్షం వలన చెరువులు నిండుతున్నాయని రైతులు ఆనందపడుతుండగా మరోవైపు మండలంలో టమోటా, కాలీఫ్లవర్, కీరకాయ వంటి పంటలు వర్షాల కారణంగా పాడైపోతున్నాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిండిన చెరువు

కొత్తకార్డులకు కష్టాలు!

- తప్పని ఆన్‌లైన్ ఇబ్బందులు
- దరఖాస్తుల కోసం నిరీక్షణ
- మ్యాపింగ్ ఆధారంగానే దరఖాస్తు స్వీకరణ
- గడువు ముగుస్తుందని అర్హుల ఆందోళన

ప్రజాశక్తి - వెదురుకుప్పం: కొత్త రేషన్ కార్డులను సేకరిస్తున్న కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఆనందంలో లబ్ధిదారులు ఆన్‌లైను కష్టాలతో దరఖాస్తు చేసుకునేందుకు సచివా లయాల్లో అలసి పోతున్నారు. దరఖాస్తులు చేసుకునేందుకు విధించిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో తప్పుల తడకగా ఉన్న హౌస్ మ్యాపింగ్‌ను ఇప్పుడు దరఖాస్తుల స్వీకరణకు ప్రామాణికంగా తీసుకోవడంతో పాటు తప్పడం లేదు.

తప్పని ఆన్‌లైను అవస్థలు

దరఖాస్తులు చేసుకునేందుకు విధించిన నిబంధనలతో ప్రజలు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వంలో తప్పులతడకగా ఉన్న హౌసింగ్ మ్యాపింగ్ ఇప్పుడు దరఖాస్తుల స్వీకరణకు ప్రామాణికంగా తీసుకోవడంతో పాటు తప్పటేదు. కుటుంబ సభ్యులు మ్యాపింగ్ ఒకే చోట జరగకుండే వారి దరఖాస్తు ఆన్‌లైన్ కావట్లేదు. మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేయడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇవి తప్పనిసరి కాదని మంత్రి ప్రకటించినా దరఖాస్తులు తీసుకోకపోవడంతో ప్రజలకు అవస్థలు పడుతున్నారు. బయోమెట్రిక్ పడకపోయినా దరఖాస్తులు ఆన్‌లైను కావట్లేదు. ఓటిపి ఆప్షన్ డిజేబుల్ చేయడంతో వేలి ముద్ర పడనివారు పలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా, మండల ప్రజలదీ ఇదే పరిస్థితి.

దరఖాస్తుల కోసం నిరీక్షణ

వెదురుకుప్పం మండలంలో 13 సచివాలయాలు, 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ సచివా లయాల్లో కొన్ని రోజులుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తులు ఆన్‌లైను చేసే ప్రక్రియలో విధించిన నిబంధనలతో ఇప్పుడు కొత్త కష్టాలు తెచ్చి పెట్టాయి. కొన్నిసార్లు ఆన్‌లైను చేసే సమయానికి సర్వర్ పనిచేయక దరఖాస్తు చేసుకునేందుకు మూడు, నాలుగు రోజులు సచివాలయాలకు తిరగాల్సి రావడంతో పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇన్ని నిబంధనలు ఉంటే ఎలా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మ్యాపింగ్ తంటా..

రేషన్ కార్డు దారులకు వివాహమై పిల్లలు ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలంటే భార్యాభర్తలు పిల్లలు ఒకే చోట హౌసింగ్ మ్యాపింగ్ అయి ఉండాలి. గత వైసిపి ప్రభుత్వం హయాంలో వాలంటీర్ల ద్వారా కుటుంబాల స్థితిగతులను తెలుసుకొనేందుకు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు దీనినే ప్రామాణికంగా నిర్ణయించింది. తల్లిదండ్రులు వారి పిల్లలు ఒకే కుటుంబం అయినా మ్యాపింగ్ ఒకే చోట లేకపోతే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆన్‌లైన్‌లో ఎర్రర్ చూపిస్తోంది. అప్పటి తప్పిదాలు ఇప్పుడు రేషన్ కార్డుదారులకు అడ్డంకిగా మారాయి. మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు ఎడిట్ చేసే అవకాశం ఇవ్వకపోవడంతో పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించకుంటే కొత్త రేషన్ కార్డు పొందే అవకాశాలు దూరాన్ని కోల్పోయినట్లే అని మండలం లోని కొందరు పేర్కొంటున్నారు.

నిబంధనలు సవరించాలి

మ్యాప్ హోల్డ్ మ్యాపింగ్ నిబంధన తొలగించక పోవడంతో పాటు ఆధార్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ ఉండాలి. మ్యారేజ్ సర్టిఫికెట్ నిబంధన తొలగించి, వీఆర్వో లేదా సంబంధిత పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణతో ఆన్‌లైను చేసే అవకాశం కల్పించాలి. బయోమెట్రిక్‌తో పాటు ఓటిపి ఆప్షన్ ఇవ్వాలని మండల వాసులు పేర్కొంటున్నారు. ఎంత మంది అయినా విడిగా కార్డులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదు..

కొత్తగా కార్డు పొందాలనికి మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేశారు. వివాహమైన వారికి వారిలో 90 శాతం మంది రిజిస్ట్రేషన్ చేసుకోరు. దీంతో ఇప్పుడు సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి వెళ్లి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు వెదురుకుప్పం మండలం కార్వేటినగరం సబ్ రిజిస్ట్రారు కార్యాలయం పరిధిలోకి వస్తుంది. ఇందుకోసం పత్రాలు రాసేవారు ఇదే అదునుగా లబ్ధిదారుల నుంచి రూ.2,500 నుంచి 5వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నట్టు పలువురు వాపోతున్నారు. మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి గతంలో ప్రకటించారు. దీన్ని ఎక్కడా పరిగణనలోకి తీసుకోలేదు.

బయోమెట్రిక్..

కార్డుల దరఖాస్తులను ఆన్‌లైను చేసే ప్రక్రియలు ప్రధానంగా దరఖాస్తు దారుడు తప్పనిసరిగా ఈ కెవైసీ బయోమెట్రిక్ (వేలిముద్రలు) వేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్ పడకపోతే ఉండే దరఖాస్తు ఆన్‌లైను కావట్లేదు. గతంలో ఆధార్ లింకే మొబైల్‌కు ఓటిపి వచ్చేది. దీని వల్లే బయోమెట్రిక్ పడిన వారికి ఉపయోగకరంగా ఉండేది. ఓటిపి ఆప్షన్ డిజేబుల్ చేశారని చెబుతున్నారు.

విభజనలో కొత్త కష్టాలు

తల్లిదండ్రులతో కలిసి ఉన్న కొడుకులు కుమార్తెలకు వివాహమై కొత్త కార్డు పొందేందుకు విభజన అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వం దాన్ని ఒక్కరికే పరిమితం చేసింది. ఇద్దరు పిల్లలు ఉండి వారికి వివాహం అయితే అందులో ఒకరికే విభజించే అవకాశం ఉండటంతో రెండో వారు దరఖాస్తు చేసు కునే అవకాశం లేదు. మ్యాపింగ్ సమయంలో భర్త వేరే ప్రాంతంలో ఉండడంతో ఆ కుటుంబం ఇప్పుడు మ్యాపింగ్ చేసు కోలేదు. పేరు మార్చుకు నమోదు చేసుకున్నారు. కార్డు రావడం లేదు. భర్త లేకుండా విడిగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు.

ఆధార్ చిరునామాతోనే..

ఆధార్ కార్డులో ఉన్న చిరునామాను దరఖాస్తు స్వీకరణ సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నారు. చిరునామా మార్పునకు అవకాశం ఇవ్వక పోవడంతో పాత చిరునామాతోనే దరఖాస్తు చేస్తున్నారు. వివాహమైన తర్వాత ఆధార్‌లో భార్య ఇంటి పేరు మార్చుకున్న భార్య భర్తలు ఇంటిపేర్లు ఒకేలా లేకుండా ఆన్‌లైనులో తీసుకోవట్లేదు.. చదువుకున్న వారు ఉద్యోగుల కోసం ఆధార్‌లో ఇంటిపేరు మార్చుకోలేదు. అలాంటి వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్నారుల బాల ఆధార్ అప్‌డేట్ అయితే కానీ వారి పేర్లను తల్లిదండ్రుల కార్డుల్లో చేర్చడానికి అవకాశం లేదు. ఇప్పుడు ఆన్‌లైను చేయాలంటే కొత్తగా దరఖాస్తు గడువుపూర్తవుతుందని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకొంత గడువు ఇవ్వాలని కోరుతున్నారు.

ఏడేళ్లుగా తిరుగుతున్నా..



ఏడు సంవత్సరాల నుంచి కొత్త రేషన్ కార్డు కోసం ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాను. మా అమ్మ కార్డు నుంచి తొలగించారు. మా అత్త వాళ్ల కార్డులో ఎక్కించుకునేందుకు, ప్రయత్నిస్తున్నాను. ఆన్‌లైను పనిచేయలేదని చెబుతున్నారు. మాంబేడు సచివా లయానికి మూడు రోజుల నుంచి కాళ్లరిగేలా తిరుగుతున్నాను. ఈరోజు అయినా అవుతుందో..లేదో తెలియడం లేదు.. అక్కడ ఉన్న ఉద్యోగులు సర్వర్ పని చేయలేదని చెబుతున్నారు.

- సుహాసిని, గెరిగిదొన, వెదురుకుప్పం మండలం.

క్రైం న్యూస్

ట్రాక్టర్ అపహరణ



గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద నిలిపి వుంచిన ట్రాక్టరు

ప్రజాశక్తి - గుడిపాల: ట్రాక్టరు అపహరణపై గుడిపాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ శనివారం మీడియాకు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. శు క్రవారం రాత్రి మండలంలోని పాపాటూరు గ్రామం వద్ద రాధాకృష్ణ గ్రానైట్ ఫ్యాక్టరీ పక్కన తుమ్మలవారిపల్లె కి చెందిన బాలకృష్ణ నాయుడు ట్రాక్టరును కాలువ రాళ్లు తీసుకొచ్చేందుకు ఉంచారు. రాత్రి వర్షం పడటంతో అక్కడే వదిలి వెళ్లాడు. ఏపీ 39 యూటీ 1588 నెంబరు ట్రాక్టరును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దినిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బంగారుపాళ్యం : అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు నల్లగాంపల్లె పంచాయతీ కేసీ కండిగ గ్రామానికి చెందిన కేశవయ్య కుమారుడు నాగయ్య (57) గత కొంతకాలంగా పక్షవాతం సోకి అనారోగ్య సమస్యలతో ఈనెల 14వ తేదీ ఒకెశకు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి అతనిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. భార్య సుహాసిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి: డిప్యూటీ కలెక్టర్

ప్రజాశక్తి - పూతలపట్టు: ప్రజలు వివిధ సమస్యలపై ఇచ్చిన ప్రతి అర్జీకి తప్పనిసరిగా పరిష్కారం చూపించాలని డిప్యూటీ కలెక్టర్ అనుపమ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రె సెల్ సిస్టమ్) ద్వారా వచ్చిన అర్జీలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన అర్జీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్ బాబు, డిప్యూటీ తహశీల్దార్ మునికృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ అనుపమ

టిడిపి గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చిత్తూరు రూరల్ మండలంలో టిడిపి గ్రామ కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో చిత్తూరు రూరల్ పరిధిలోని అనగల్లు, పాలూరు, పచ్చనపల్లి, బీఎన్‌ఆర్ పేట, గువ్వకల్లు, అనంతాపురం గ్రామ పంచాయతీలకు సంబంధించి గ్రామ కమిటీ ఎన్నికలు, ఇన్‌చార్జులు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శేఖర్ బాబు, కార్యదర్శి రఘు, జిల్లా ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - విజయపురం (నగరి): పట్టణ పరిధి బస్టాండు సమీపం లో ఉన్న మునీశ్వర స్వామి ఆలయాన్ని స్థానిక దాతల సహకారంతో నవీకరిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా మునీశ్వర చెట్టు పీఠం, పొంగళ్ల గది, విశ్రాంతి గది, బాత్‌రూము, ప్రహరి, ఆర్చ్ పనులు పూర్తయింది. ఇంకా డైనింగ్ హాలు, గేట్లు తదితర పనులు చేపట్టవలసి ఉన్నది. ఈ పనులకు రాష్ట్ర పట్టు సమాఖ్య అభివృద్ధి మాజీ ఛైర్మన్ రాధాకృష్ణ కుటుంబ సభ్యులు రూ.50వేలు విరాళం అందించారు. శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ వారికి చెక్కును అందించారు. తదుపరి పనులకు కూడా తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మనోహర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చింతచెట్లు నరికివేత

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు పట్టణం నడిబొడ్డున జాతీయ రహదారి పక్కనే కొన్ని దశాబ్దాల నాటి చింతచెట్లు అక్రమంగా నరికివేతకు గురి అయిన అధికారులు పట్టించుకోక పోవడం గమనార్హం. పలమనేరు పట్టణంలో బెంగళూరు , చెన్నయ్ జాతీయ రహదారి లో ఎంపీడీఓ కార్యాలయం అనేక ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో నున్న భారీ చింతచెట్లను అక్రమార్కులు రాత్రికి రాత్రే నరికేసి గుట్టు చప్పుడు కాకుండా ,ఆనవాళ్లు లేకుండా ఆ స్థలంలో మట్టితో పూడ్చిన దృశ్యం చూసి, చింత చెట్లు ఎలా మాయమయ్యాయని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. గత 3 రోజులుగా తిరుపతి గంగమ్మ జాతర వేడుకల్లో మునిగి తేలుతున్న అధికారుల కల్లుగప్పి బెంగ ళూరు-తిరుపతి జాతీయ రహదారి, . మున్సిపల్ పరిధి లోనున్న దశాబ్దాల కాలం నాటి చింతచెట్లను తొలగించడానికి రెవెన్యూ, ఆర్ అండ్ బి. ఫారెస్ట్ తదితర శాఖాధికారుల అనుమతి లేకుండా, వాల్టా చట్టాన్ని అతిక్రమించి అక్రమాలకు పాల్పడిన వైనంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమా ర్కులు వెనుక కొంతమంది బడా నాయకుల హస్తం ఉన్నట్లు గుసగుసలు వినిపిసు న్నాయి. ఈ విషయమై స్థానిక ప్రజాశక్తి విలేఖరి అటవీశాఖ ,ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులను విచారించగా తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుంటారో.. లేదో ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

భక్తులకు లడ్డూలు పంపిణీ

ప్రజాశక్తి-పలమనేరు: గంగ జాతర సందర్భంగా పలమనేరుకు చెందిన మంచాల శంకర్ కుమార్తె మంచాల దివ్య ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఐదువేల లడ్డూలను ఉచితంగా భక్తులకు పంపిణీ చేశారు. గంగమ్మ గుడి ఛైర్మన్ పాలకమండల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పుర ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

భూదాన కార్యక్రమానికి విరాళం

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయానికి శాంతిపురం మండలానికి చెందిన టిడిపి నాయకులు వారి విరాళాన్ని అందించారు. శనివారం మండలానికి చెందిన నందిగాం కుటుంబ సభ్యులు నందిగాం వెంకటాద్రి నాయుడు, నందిగాం ఉదయ్ కుమార్ నాయుడులు 1,12,500 రూపాయలు, అదే మండలానికి చెందిన జనార్ధన్ నాయుడు 37,500 రూపాయలు విరాళాన్ని అందించారని ఆలయ కమిటీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బి ఎం కె రవిచంద్రబాబు, టిటిడి పాలక మండలి సభ్యులు శాంతారామ్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక టిడిపి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

18 అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మే 19 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవ తాయని టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ శనివారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో స్వామి రోజుకో అవతారంలో వివిధ వాహనాలపై విహరిస్తారని తెలిపారు. 18వ తేదీ ఆదివారం ఉదయం మాడవీధిలో వెలసి ఉన్న ఆంజనేయస్వామి వారికి వేద పండితులు వేద మంత్రాల నడుమ అభిషేకం నిర్వహిస్తారని, సాయంత్రం అంకురార్పణ, 19 ధ్వజారోహణం, రాత్రికి పెద్ద శేషవాహనం, 20న చిన్నశేష వాహనం, రాత్రికి స్వామివారు వీణాపాణై హంసవాహనంపై ఊరేగుతారు. 21న సింహవాహనం, రాత్రికి ముత్యపుపందిరి వాహనం, 22 కల్పవృక్షవాహనం, ఆర్జిత కళ్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం, 23న మోహనీ అవతారం, రాత్రికి గరుడ సేవ, 24న హనుమంత వాహనం, సాయంత్రం వసంతోత్సవం రాత్రి గజవాహనం, 25న సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలు, 26న రథోత్సవం, రాత్రి అశ్వవాహనం. 27న పల్లకి సేవ, చక్రస్నానం, సాయంత్రం ధ్వజాఅవరోహణ కార్యక్రమాలతో ముగిస్తుందని తెలిపారు.



భద్రత నడుమ ఉత్సవాలు నిర్వహించాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి- కార్వేటినగరం : కార్వేటినగరంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 18 వ తేదీ నుండి నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను భద్రత నడుమ నిర్వహించాలని నగరి డిఎస్పి మహమ్మద్ అజీజ్ అధికారులను ఆదేశించారు. డిఎస్పి కార్వేటినగరం వేణుగోపాలస్వామి ఆలయాన్ని శనివారం సందర్శించి అక్కడ ఆలయ అధికారులకు బ్రహ్మోత్సవాలలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. బ్రహ్మోత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆలయ అధికారులకు తెలిపారు.

గంగమ్మ జాతర చాటింపు

ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టులో రానున్న మంగళవారం నడి వీధి గంగమ్మ జాతరకు సంబంధించి శుక్రవారం రాత్రి చాటింపు నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్త జగదీశ్వర్ రెడ్డి ఇంటి నుంచి మంగళ వాయిద్యాల నడుమ పూజా సామగ్రిని తీసుకొచ్చారు. తాత్కాలికంగా నడి వీధి గంగమ్మ అమ్మవారి పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణాసంచాలు పేల్చి చాటింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఉత్తమ విద్యకు ర్యాంకులు తార్కాణం కాదు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : విద్యార్థులు సాధించిన ర్యాంకులు ఉత్తమ విద్యకు తార్కాణం కాదని, వారి సంస్కారం, తెలివితేటలు, వ్యక్తిత్వం మాత్రమే ఉత్తమ విద్యకు తార్కాణంగా నిలుస్తుందని హాకింగ్స్ పాఠశాల కమిటీ అధ్యక్షులు హఫీజ్ తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో పదవ తరగతి విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి పాఠశాల కమిటీ అధ్యక్షులు, సభ్యులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు మాట్లాడుతూ తమ పాఠశాల సీబీఎస్ఈ గుర్తింపు పొందిన అనంతరం విద్యార్థులు తొలిసారిగా పదవ తరగతి పరీక్షలు రాశారన్నారు. అయితే సీబీఎస్ఈ విడుదల చేసిన పరీక్ష ఫలితాల ప్రకారం తమ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా ఒత్తిడి లేని విద్య అందించడమే లక్ష్యంగా తమ పాఠశాల పనిచేస్తుందని, ఇందుకోసం తమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు మరెన్నో సహపాఠ్య కార్యక్రమాలు పాఠశాల విద్యలో భాగం చేశామని తెలిపారు. విద్యార్థులు సాధించిన విజయానికి కారకులైన ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ సన్మాన సభ ఏర్పాటు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నాయకుడికి నివాళి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : కటిక పల్లి గ్రామ సర్పంచ్ మార్కొండయ్యకు పితృవియోగం కలిగింది. ఎస్ఆర్ పురం మండలంలోని కటిక పల్లి గ్రామ పంచాయతీ కటిక పల్లి గ్రామ సర్పంచ్ మార్కొండయ్య తండ్రి వైసిపి సీనియర్ నాయకుడు శీనయ్య (65) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామితో పాటు పలువురు నాయకులు ఆయన భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి వైసిపి నాయకుడు సీనయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గురువారెడ్డి విజయబాబు, కుప్పయ్య , జనార్ధన్, యేసు రత్నం,మణి గోవిందరెడ్డి, కోటిరెడ్డి బాబు, రిటైర్డ్ టీచర్ దొరస్వామి , హరి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి , ముత్యాలు శ్యాము అమావాస్య , యుగంధర్ పలువురు సర్పంచులు , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : మండలంలోని బేలుపల్లి పంచాయతీ పరిధిలోని పట్టినపల్లి గ్రామంలోని కళ్యాణ వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వర్షం కారణంగా గురువారం రాత్రి జరగాల్సిన పుష్పల్లకి సేవలు వర్షం కారణంగా ఆగిపోయాయి. శుక్రవారం రాత్రి యధావిధిగా శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామికి పుష్పల్లకి సేవలు పురోహితులచే నిర్వహించి బేలుపల్లిగ్రామం నుండి పట్నపల్లి గ్రామం సమీపంలో వెలసి ఉన్న కొండపైకి పురుష పల్లకి ద్వారా బాన వేడుకల నడుమ స్వామివారు భక్తులకు కనువిందు చేశారు.

గంగమ్మ గుడి హుండీ ఆదాయం రూ.8 ,76,230

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు లో గత 15 రోజులుగా వైభవంగా నిర్వహించిన గంగ జాతర శుక్రవారం ఉదయం 9 గంటలకు జలనిమజ్జనంతో ముగిసింది. శనివారం మధ్యాహ్నం హుండీ లెక్కింపునిర్వహించారు. హుండీ లెక్కింపులో నగదు ఎనిమిది లక్షల 76 వేల230 రూపాయలు రాగా, ఐదు గ్రాముల బంగారు, 76 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. గత సంవత్సరంతో పోల్చగా ఈసారి దాదాపుగా 37 వేల రూపాయల నగదు అధికంగా హుండీ ద్వారా వచ్చినట్లు తెలిపారు. అంగళ్ల వేలం పాటలో 2,29,000 రూపాయలు వచ్చినట్లు తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం..



పెద్దపంజాణిలో

ప్రజాశక్తి - పెద్దపంజాణి: మానవాళి మనుగడకు అందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎంపిడివో బాలాజీ అన్నారు. శనివారం ' స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర' దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కోగిలేరు సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ బాబు, ఈపీఓపీఆర్డీ శారదాదేవి, పంచాయతీ కార్యదర్శి సుజాత, వెల్ఫేర్ అధికారి నజీర్ భాష,డిజిటల్ అసిస్టెంట్ జ్యోతి స్వరూప్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వనజ,ఏఎన్ఎం సుజాత,మహిళా పోలీస్ తేజస్వివాణి, సచివాలయ సర్వేయర్ అజిత, అంగన్వాడీ కార్యకర్త సావిత్రమ్మ పాల్గొన్నారు.

కార్వేటినగరం : ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఇవోపీఆర్‌డి జె నాగరత్నం శనివారం మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఎవో విద్యావతి మాట్లాడుతూ నాటి మొక్కలను సంరక్షించాలన్నారు. వెలుగు కార్యాలయ ఆవరణలో ఎపిఎం కవిత ఆధ్వర్యంలో కానుగ మొక్కలు నాటారు. ఆర్డబ్ల్యూఎస్ డిఇ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మొక్కలను నాటి పరిసరాలను శుభ్రం చేశారు. కత్తెర పల్లి పిహెచ్సిలో పరిసరాలను శుభ్రం చేశారు. వైద్యాధి కారిణి డాక్టర్ భువనేశ్వరి, హేమశ్రీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సోమల: ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరం వద్ద తహశీల్దార్ బెన్ను రాజ్, ఎంపీడీవో నారాయణ, ఈవో ఆర్ డి లక్ష్మీదేవి ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్ అన్నారు. ప్రజలు పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించాలని తద్వారా ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా గ్రామాలు కూడా పరిశుభ్రంగా ఉండి దోమలు ఇతర క్రిమి కీటకాలు వృద్ధి చెందకుండా ఉండే అవకాశం ఉందని పలువురు అన్నారు.

గంగాధర నెల్లూరు: డిసిసిబి బ్యాంకు జిల్లా అధికారులు సహకార సంఘం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని గంగాధర నెల్లూరు సహకార సంఘం కార్యాలయంలో డిసిఒ నాగవర్ధన, సింగిల్ విండో పర్సన్ ఇంచార్జ్ శ్రీనివాసల రెడ్డి ఆధ్వర్యంలో బ్యాంకు కంప్యూటరీకరణ పై తనిఖీ నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు. అనంతరం బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రర్ కిషోర్, బ్యాంకు మేనేజర్ గోమతి, సహకార సంఘం సీఈఓ విజయ్ కుమార్ రెడ్డి, సూపర్వైజర్ మాధురి, స్టాఫ్ అసిస్టెంట్ మునుస్వామి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : వేసవిలో తగు జాగ్రత్తలను పాటించడం వల్ల వేడిని తట్టుకోవచ్చని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిదంబరం తెలిపారు. శనివారం కళాశాలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పి.ఇ.ఎస్ ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ మానవులు వేడిని తట్టుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ రోజుకు 4 నుండి 5 లీటర్ల నీటిని తాగడం ద్వారా వడదెబ్బ నుండి రక్షించుకోవచ్చు అని తెలిపారు. చెట్ల పెంపకం వల్ల వేడిని తట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి. నారాయణ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి. ప్రదీప్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛాంధ్ర ' సందర్భంగా డాక్టర్ అరుణ్ కుమార్, పంచాయతీరాజ్ శేఖర్ ఆచార్య ఆధ్వర్యంలో శనివారం తీర్థం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ్ కుమార్ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, స్టాఫ్ నర్సులు, శిరీష, జగదీష్, కిషోర్, చంద్రకళ ,రాజారెడ్డి, ఆశాలు, పాల్గొన్నారు.

కుప్పం ఆర్టీసీలో బస్సుల జాతర

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం ఆర్టీసీ డిపోలో బస్సుల జాతర కొనసాగుతున్నట్టు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. శనివారం కుప్పం ఆర్టీసీ బస్టాండు పరిధిలో డిపో మేనేజర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీతో పాటు ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిటిడి పాలక మండలి సభ్యులు శాంతారామ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబులు ముఖ్య అతిథులుగా విచ్చేసి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం ఆర్టిసి డిపోను రాష్ట్రంలోనే ఆదర్శ డిపోగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి కుప్పం డిపో నుండి బస్సు సర్వీసులను పెంచుతూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నట్టు తెలిపారు. అంతేకాక రూ.70 కోట్ల నిధులతో ఆర్టీసీ డిపోను అధునాతన సౌకర్యాలతో నిర్మించడానికి త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. అంతేకాక కుప్పం డిపోలో ఉన్న డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను ప్రారం భించ డానికి ప్రయత్నాలు సాగుతు న్నాయన్నారు. నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, రాజారామ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షులు రాజకుమార్, రాష్ట్ర నేత గోపీనాథ్, సత్యంద్ర శేఖర్, ఆర్టీసీ డిఎం గోపినాథ్ పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు సమన్వయంతో పరిష్కరించాలి: ఎంపిపి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - రామకుప్పం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు, అధికారులను సమన్వయం చేసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సులోచన గురప్ప పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అడవి సమీప ప్రాంత రైతులు సాగు చేస్తున్న పంట పొలాల్లో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉందని , దీంతో ఏనుగులు కూడా సంచరిస్తున్నాయని, వాటిని విద్యుత్ శాఖ అధికారులు పరిష్కరించాలని సభ్యులు కోరారు. పాఠశాలలో ఉపాధ్యాయులు విధులు సక్రమంగా హాజరు కాకపో వడాన్ని అధికారులు పర్యవేక్షించడం లేదన్నారు. ముఖ్యంగా వీర్నమల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పశువులు కట్టి పరిసరాలు అపరిశుభ్రం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలకు ఏనుగుల దాడి అపార నష్టాన్ని కలిగిస్తున్నాయని ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సోలార్ కంచె, కందకాలు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడు, తహశీల్దారు కౌలేష్, ఎంపీడీవో మురళీధర్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ లు, ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పొన్నెమ్మ తిరునాళ్లు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు:

మండల పరిధిలోని బొమ్మ వారి పల్లెలోని పొన్నెమ్మ ఆలయంలో తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పుష్ప పల్లకిలో బాణసంచా వేడుకలు, బ్యాండ్ బాజాలు , కోలాటాల మధ్య పిల్లలు, మహిళలు, యువకులు నృత్యాలతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు.

అవగాహనా సదస్సు

ప్రజాశక్తి -గంగవరం:

గంగవరం మండలం పత్తికొండ ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవ సందర్భంగా డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రక్తపోటు నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఔషధాల వాడకం వాటిపై అవగాహన కల్పించారు.



టిడిపి మండల అధ్యక్షులుగా ధరణి ప్రసాద్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:

టిడిపి మండల అధ్యక్షులుగా ధరణి ప్రసాద్ ను ఏకగ్రీ వం గా ఎన్ను కున్నా రు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయం లో నియోజక వర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్ పూతలపట్టు నియోజక వర్గం ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఆధ్వర్యంలో టిడిపి మండల అధ్యక్షులుగా నలగంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ జయ చంద్ర నాయుడు కుమారుడు ధరణి ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన ధరణి ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు అభివృద్ధికి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు జయప్రకాష్, జనార్ధన్ గౌడ్, కోకా ప్రకాష్ నాయుడు, కోదండ యాదవ్, హేమచంద్ర నాయుడు, బీసీ రవీందర్ నాయుడు, లోకనాథం నాయుడు, హరి ప్రసాద్, రమేష్, చిన్నయ్య, గిరిబాబు, శివ పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

యాదమరి టిడిపి మండల అధ్యక్షుడుగా మొరార్జీ యాదవ్



మొరార్జీ యాదవ్‌ను అభినందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి టిడిపి మండల అధ్యక్షులుగా మొరార్జీ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. చిత్తూరు టిడిపి కార్యాలయంలో శనివారం పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని యాదమరి మండల టిడిపి అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే మురళీ మోహన్ అధ్యక్షతన మండల టిడిపి అధ్యక్షుడిని ఏక గ్రీవంగా ప్రకటించారు.చిత్తూరు జిల్లా, పూతలపట్టు నియోజకవర్గ టిడిపి ముఖ్య నాయకుల మధ్య నిర్వహించిన ఎన్నికల్లో మండల టిడిపి నాయకుడిగా మొరార్జీ యాదవ్ రెండవ సారి ఎన్నికయ్యాడు. ఆయనను ఎమ్మెల్యే అభినందించారు. మండల టిడిపి నాయకులు దుశ్శాలువా కప్పి శుభాకంక్షలు తెలిపారు.ఈ సంద ర్భం గా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి పాటు పడతామని తెలి పారు. ఈ కార్యక్ర మం లో చిత్తూరు జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, చిత్తూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కోక ప్రకాష్ నాయుడు, పూతలపట్టు నియోజకవర్గం పరిశీలకులు బొమ్మన శ్రీధర్, పూతలపట్టు మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, బంగారుపాళ్యం మండల మాజీ అధ్యక్షులు ఎన్.పి. జయప్రకాష్ నాయుడు, యాదమరి మండల ప్రధాన కార్యదర్శి రబ్బి, రాజేందర్ నాయుడు, చిత్రా నాయుడు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- కార్వేటినగరం : కార్వేటి నగరం పంచాయతీ కార్యాలయం వద్ద వేసవిని దృష్టిలో వుంచుకుని శనివారం చలివేంద్రాన్ని స్థానిక ధనంజయ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇవోపిఆర్డి నాగరత్నం మాట్లాడుతూ వేసవిలో ప్రతి ఒక్కరూ నీరు, మజ్జిగ, నిమ్మకాయ నీళ్లు ఎక్కువగా తాగాలని అప్పుడు ఆరోగ్యంగా ఉంటా రన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు మజ్జిగ, ఓఆర్ఎస్ లు పంపిణీ చేశారు. వేసవిలో తాగు నీటి దాహానికి తీర్చడానికి ఈ చలివేంద్ర ఎంతో ఉపయోగ కరంగా ఉంటుం దన్నారు. ఉప సర్పంచ్ శాంతి, శేషాద్రి, సచివాలయ సిబ్బంది పా ల్గొన్నారు.

అప్పు చెల్లించలేదని గర్భిణి నిర్బంధం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అప్పు చెల్లించలేదని కారణంతో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్లు గర్భిణి అయిన తన భార్య యువరాణిని అక్రమంగా నిర్బంధించారని గంగాధర నెల్లూరు మండలం అక్కన్నగారిపల్లి గ్రామానికి చెందిన భరత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను 2023లో హీరో ఫిన్ కార్పొరేషన్ ప్రైవేట్ కంపెనీ నుంచి రూ.1,50,000లు రుణం తీసుకున్నానని, 36 నెలల్లో ఈ అప్పుని తీర్చేలా ఒప్పందం చేసుకున్నామన్నారు. గత 22 నెలలుగా కంతులను కడుతూ వచ్చానని.. అనారోగ్యం కారణంగా ఇటీవల కొన్ని నెలలుగా కంతులను చెల్లించలేదని తెలిపారు. అయితే ఇటీవలే రికవరీ ఏజెంట్లు కంతులను చెల్లించలేదని కారణంతో తన భార్యను తీసుకెళ్లి నిర్బంధించారని ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సారా రహిత రాష్ట్రం కోసమే నవోదయం 2.0



ప్రజాశక్తి- విజయపురం: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా విజయపురం మండలం మంగళం గ్రామంలో సారాకు వ్యతిరేకంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు నగరి డీఎస్పీ తమిళనాడు సరిహద్దులోని తిరుత్తణి పోలీస్ ఆధ్వర్యంలో నగని ప్రొహిబిషన్, నగరి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సారా తయారు చేసినా, అమ్మినా, రవాణా చేసినా ఏపీ ప్రొహిబిషన్ చట్టం 1995 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నవోదయం 2.0 భాగంగా రాష్ట్రాన్ని నాటు సారా రహితంగా మార్చేం దుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. నగిరి, ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని విజయపురం మండలం విజయపురం, ఏ మంగళం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించగా 10 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి పేపర్లు లేని ద్విచక్ర వాహనాలను విజయపురం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.